తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
మంగళవారం
19 మే 2026
పేజీలు : 08



# సిస్టమాటిక్ సర్



## దేశవ్యాప్త సర్వేలో సి.నారాయణ రెడ్డి ప్రతిభా పాటవం

- 800 జిల్లాల్లోని జిల్లా మేజిస్ట్రేట్‌లపై విస్తృత సర్వే
- ప్రజా సేవలో, జవాబుదారీతనంలో అత్యుత్తమ పనితీరు

**2026 సంవత్సరానికిగాను దేశవ్యాప్తంగా ఉన్న 100 మంది "అత్యుత్తమ, ఉత్తమ పనితీరు కనబరిచిన" జిల్లా మేజిస్ట్రేట్‌ల ఫేమ్ ఇండియా మ్యాగజైన్ జాబితాలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సహా ముగ్గురు తెలంగాణ జిల్లా కలెక్టర్లు చోటు దక్కించుకున్నారు. ఫేమ్ ఇండియా ఆసియా పోస్ట్‌తో కలిసి దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో హరిచందన దాసరి (హైదరాబాద్), సి నారాయణ రెడ్డి (రంగారెడ్డి), మిక్కిలినేని మను చౌదరి (మేడ్చల్-మల్కాజిగిరి) ఎంపికయ్యారు. ప్రఖ్యాత రేటింగ్ పత్రిక అయిన ఫేమ్ ఇండియా, తన సర్వే ఫలితాలలో 100 మంది జిల్లా మేజిస్ట్రేట్‌లను (డిఎంలను) రాష్ట్రంలోని "అత్యుత్తమ, ఉత్తమ పనితీరు కనబరిచే" పరిపాలనా అధిపతులుగా పేర్కొంది. వారిలో అత్యంత విశిష్టమైన ఇరవై ఐదు మందిని తన రాబోయే 2026 సంచికలో ప్రచురించనుంది.**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా 800 జిల్లాల్లోని జిల్లా మేజిస్ట్రేట్‌లపై నిర్వహించిన ఈ విస్తృత సర్వే, సవాలుతో కూడిన పరిస్థితుల నడుమ ప్రజాసేవలో అత్యుత్తమ నాయకత్వాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుంది. 2011లో ప్రారంభమైన ఈ సర్వే, ఆ ప్రముఖ మీడియా సంస్థలో ఒక వార్షిక సంప్రదాయంగా మారింది. సంవత్సరాలుగా 'పని తీరు, నిర్వాహణ' ఆధారంగా డీఎంలను వర్గీకరించడం అనేది, కేవలం ఎంపికైన వారికే కాకుండా తోటి అధికారులకు కూడా ఒక నైతిక ఉన్నత ప్రమాణాన్ని నెలకొల్పింది. ఈ సర్వే భారతదేశవ్యాప్తంగా దాదాపు 800 జిల్లాలకు చెందిన జిల్లా మేజిస్ట్రేట్‌లు, కలెక్టర్‌లను పరిపాలనా సామర్థ్యం, పాలన, ఆవిష్కరణ, సంక్షోభ నిర్వహణ, జవాబుదారీతనం, ప్రజా సంబంధాలు, అభివృద్ధి-ఆధారిత ఆలోచనా విధానం వంటి అంశాలపై అంచనా వేసింది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను అమలు చేసే క్రమంలో పరిపాలన, ప్రజా సేవలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులను గుర్తించడమే ఈ సర్వే లక్ష్యమని ఫేమ్ ఇండియా తెలిపింది. ప్రాథమిక ఫలితాల్లో సుమారు 100 మంది అధికారులు ఎంపికయ్యారని, వీరిలో నుంచి కొందరు విశిష్ట జిల్లా మేజిస్ట్రేట్‌లను తమ రాబోయే పత్రికలో ప్రచురించనున్నట్లు కూడా అది తెలియజేసింది.





# మైనర్ బాలికలపై లైంగిక దాడులు ఆగేనా..!

**జిల్లాలో రోజురోజుకు పెరిగిపోతున్న మైనర్ బాలికలపై దారుణాలు**

- తాజాగా తాండూరు పట్టణంలో మరో ఫోక్స్ కేసు
- వేసవి సెలవులే బాలికల పట్ల శాపం
- లైంగిక దాడికి గురైన వారంతా విద్యార్థినీలే
- ఎన్ని అవగాహన సదస్సులు జరిగిన ఆగని దారుణాలు

లోపలి పేజీలో

*రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో మార్చ్ 6 నుంచి జూన్12 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. అందులో రాష్ట్ర మంత్రుల నుంచి గ్రామస్థాయి ప్రజా పాలకుల వరకు పాలుపంచుకుంటున్నారు. అందులో పిల్లల భద్రత రక్షణ అనే అంశంపై గ్రామస్థాయి నుంచి మే2 వరకు నియోజకవర్గ స్థాయి వరకు పిల్లలపై లైంగిక దాడుల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విశేషమేమిటంటే ఒకవైపు అవగాహన సదస్సులు జరుగుతుండగానే మరోవైపు మే నెలలో మైనర్ బాలికలపై వరుసగా లైంగిక దాడులు జరిగాయి. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో తాజాగా మరో ఫోక్స్ కేసు సంఘటన జరిగింది.*

**వికారాబాద్ జిల్లా బ్యూరో మే 18 (జనం సాక్షి):**



## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

లోపలి పేజీలో

# ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ వ్యయాన్ని పెట్టుబడిగా భావించాలి

## అది వృథా ఖర్చు కాదు

- ఎస్కి డైరెక్టర్ డా.జి.రామేశ్వర్ రావు



**ఖైరతాబాద్, మే 18 (జనం సాక్షి) :** ఉద్యోగుల వృత్తి జీవితంలో వారి ఎదుగుదలకు అనుగుణంగా ప్రతి దశలో అందించే కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ప్రభుత్వానికి పెట్టుబడిలాంటిదే గానీ, అనవసర ఖర్చు కాదని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండి యా (ఈఎస్ సీఐ) డైరెక్టర్ డా.జి.రామేశ్వర్ రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పవర్ ఫైనాన్స్ కార్పొరే షన్(పీఎఫ్సీ) ఆధ్వర్యంలో, ఎస్కికి చెందిన పవర్ అండ్ ఎనర్జీ, వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ఎస్కి ప్రాంగణంలో ప్రారంభమైంద ని తెలిపారు. ఈ సందర్భంగా డా.రామేశ్వర్ రావు మాట్లాడుతూ, రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్(ఆర్డీఎస్ఎస్) కింద భారత ప్రభుత్వ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో దేశంలోని వివిధ రాష్ట్రాల డిస్కంలలో పనిచేస్తున్న 2,500 మంది మిడిల్ లెవల్ మేనేజ్‌మెంట్ ఇంజినీర్లకు గత 11 నెలలుగా ఎస్కి ద్వారా సీనియర్ నిపుణులతో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ఫండ మెంటల్స్ ఆఫ్ పవర్ క్వాలిటీ, ఫ్రీక్వెన్సీ స్టెబిలిటీ, మెడికల్ గ్యాస్ పైప్‌లైన్ సిస్టమ్స్, ఫైర్ డిటెక్షన్, ఫైర్ సేఫ్టీ ఆడిట్, సైబర్ సెక్యూరిటీ వంటి కీలక అంశాల పై సాంకేతిక అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.ఐ.ఎస్.ఎన్. రాజు, పే.నరేంద్ర కుమార్, సయ్యద్ హుస్సేన్, డా.వి.వి ద్యా సాగర్, కాలేజ్ చీఫ్ ఎస్.లక్ష్మీకాంత రావు, డా.పి.రాజారావు, శ్రీకాంత్, నరేశ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి, పీర్జాదిగూడ ప్రజల తాగునీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**మేడిపల్లిలోని రెండు రిజర్వాయర్ ట్యాంకులను నింపి ప్రతి ఇంటికీ నీరు అందించాలి**

- వాటర్ వర్క్స్ జి.ఎం కు వినతిపత్రం అందించిన తుంగతుర్తి రవి





లోపలి పేజీలో

మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలో నెలకొన్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ అధికారులను కోరారు.ఈ మేరకు ఉప్పల్ జోన్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్,డిప్యూటీ జనరల్ మేనేజర్ సరితలకు వినతిపత్రం అందజేశారు.

## రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్‌లో భారీ చేరికలు



**రాజేంద్రనగర్,మే18(జనంసాక్షి)**రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భారాసపార్టీలో భారీగా చేరికలు జరిగాయి. మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి నాయకత్వంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు.కొంపల్లి జగదీష్ కృషితో కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చేరిన నాయకులకు సబితా ఇంద్రా రెడ్డి, కార్తీక్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, కార్తీక్ రెడ్డి నాయకత్వాన్ని చూసి ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. ఇతర పార్టీల్లో కార్యకర్తలకు ప్రాధాన్యం లేకపోవడంతో బీఆర్ఎస్‌ను ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారని తెలిపారు.కాటేదాన్ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, సబితా ఇంద్రా రెడ్డి మార్గదర్శకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రాము యాదవ్, కొంపల్లి జగదీష్, మైసి రెడ్డి, సంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, అనిల్, సంతోష్, చిన్న ప్రదీప్, అశోక్ కుమార్, కార్తీక్ ముదిరాజ్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనాభా గణన ఇండ్ల గణన కార్యక్రమం పరిశీలించిన డీసీ



**రాజేంద్రనగర్,మే18(జనం సాక్షి)**భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనాభా గణన 2027 కార్యక్రమంలో భాగంగా మొదటి విడత ఇండ్ల గణన కార్యక్రమం మే 11 నుంచి క్షేత్రస్థాయిలో కొనసాగుతోంది.సోమవారంనార్సింగి సర్కిల్ గండిపేట ప్రాంతంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ టి. కృష్ణ మోహన్ రెడ్డి పరిశీలించి గణన సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులకు పలు సూచనలు చేస్తూ, గణన ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని సూచించారు.అలాగే ప్రజలు జనాభా గణన కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సహకరించాలని డిప్యూటీ కమిషనర్ కోరారు. గణన సిబ్బందికి అవసరమైన సరైన వివరాలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## షాద్ నగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్ శ్రీధర్ ఎన్నిక



**జనంసాక్షి ఫరూఖ్ నగర్** షాద్ నగర్ మున్సిపాలిటీ నూతన అధ్యక్షుడిగా నల్లమోనీ శ్రీధర్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న అనంతరం నల్లమోని శ్రీధర్ మాట్లాడుతూ తనపై నమ్మకాన్ని ఉంచి ఇంతటి గొప్ప అవకాశాన్నిచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో తనను ప్రోత్సహిస్తున్న తన వెంట ఉన్న నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే శంకరన్న ఆధ్వర్యంలో పార్టీ పటిష్టతకు ఎల్లవేళలా కృషి చేస్తానని, పట్టణంలోని ప్రతి నాయకుడికి కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, అధిష్టానం ఆదేశాల మేరకు పనిచేస్తానని, పార్టీ నమ్మకాన్ని ఎప్పుడు వమ్ము చేయకుండా కష్టపడి పని చేస్తానని, అందరికీ అందుబాటులో ఉంటానని, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి నడుస్తానని తెలిపారు.

## మణికొండలో రోడ్లు, డ్రైనేజ్ సమస్యలపై జోనల్ కమిషనర్ కు ఆర్వీపీల వినతి



**రాజేంద్రనగర్,మే18(జనంసాక్షి)**మణికొండ ప్రాంతంలోని పలు పౌర సమస్యలపై మణికొండలోని అన్ని కాలనీల ఆర్వీపీల సమాఖ్య ప్రతినిధులు అధ్యక్షుడు అర్వపల్లి వంశీ ఆధ్వర్యంలో సిఎంసీ జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.మణికొండలో పూర్తి కాలేని రోడ్ల నిర్మాణం, ఇంకా వేయని రోడ్లను త్వరగా వేయడం, గుంతలు పడిన రోడ్లను తరచుగా మరమ్మతు చేయాలని సమాఖ్య కోరింది. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్ నంబర్ 13 నుండి బీఆర్‌సీ రోడ్ వరకు, అలాగే అలకాపూర్ టౌన్‌షిప్ 100 ఫీట్ల రోడ్ నుంచి నార్సింగి రోడ్ వరకు కనెక్టివిటీ రోడ్లను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేసింది. ఇంకా మర్రిచెట్టు నుంచి ట్రైల్స్ విల్లాస్ రోడ్, ఆంధ్రా బ్యాంక్ పైప్‌లైన్ రోడ్ నుంచి షేక్‌పేట్ వరకు మంజూరైనా, కానీ పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే పందెం వాగు నుంచి తారామతి బరాదరి వరకు నాళాల శుభ్రపరిచే పనులు, డ్రైనేజ్ కల్వర్ట్ పనులు పూర్తి చేయడం, హైడ్రా సంరక్షణలో ఉన్న తిరుమల హిల్స్ పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేయాలని కూడా సూచించారు.ఈ సందర్భంగా మణికొండలో గుంతలు పడిన రోడ్లను త్వరగా మరమ్మతు చేయడానికి సహకరిస్తామని జోనల్ కమిషనర్ అమిత్ హామీ ఇచ్చారు. తక్షణ చర్య అవసరమైన రోడ్ల వివరాలను ఆర్వీపీలు అందించాలని కోరారు. పలు ప్రాంతాల్లో ఉన్న ప్రాపర్టీ ట్యాక్స్ సమస్యలను కూడా సమాఖ్య ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమావేశంలో సమాఖ్య ఉపాధ్యక్షురాలు ప్రవీణ, సంయుక్త కార్యదర్శులు శంకర్ దేవ్, కృష్ణ కుమార్, ఈసీ సభ్యులు డాక్టర్ పి. అవినాష్, డి. శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, ఎరన్న, ఏటీఆర్‌డబ్ల్యూఏ ఈసీ సభ్యుడు ఎస్‌వీఎన్ఎస్ శర్మ పాల్గొన్నారు.

## జీఓ 81 & 85 ప్రకారం వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

### పెద్దేముల్ తహసీల్దార్‌కు విఆర్ఎల వినతి"



పెద్దేముల్, మే 18(జనంసాక్షి): జీఓ నెం. 81 ఠ 85 ప్రకారం మిగిలిపోయిన 3,797 మంది విఆర్ఏ వారసులకు వెంటనే ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ సోమవారం పెద్దేముల్ మండల తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్‌కు విఆర్ఏలు మెమొరండం సమర్పించారు. ఈ సందర్భంగా విఆర్ఏలు మాట్లాడుతూ.. 2020 సెప్టెంబర్ 9న గత ప్రభుత్వం అసెంబ్లీలో విఆర్ఏలకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించింది. 80 రోజుల సమ్మె అనంతరం 2023 జూలైలో జీఓ 81 ఠ 85 విడుదల చేసింది. దీని ప్రకారం 20,555 మంది విఆర్ఏల్లో 16,758 మందిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేశారు. అయితే మిగిలిన 3,797 మంది వారసులకు 3 ఏళ్లుగా ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే మాకు ఉద్యోగం వస్తుందనే ఆశతో అన్నదమ్ములకు భూములు రాసిచ్చాం, లక్షల అప్పులు చేసి వాటాలు ఇచ్చాం. ఉద్యోగం రాక వడ్డీలు పెరిగి కుటుంబాలు చితికిపోయాయి. మానసిక ఒత్తిడితో 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు, 555 మందికి పైగా విఆర్ఏలు మరణించార అని తెలిపారు. ప్రస్తుతం 20,555 మంది చేసే రెవెన్యూ పనులను కేవలం 3,797 మంది విఆర్ఏలే చేస్తున్నారని, రెవెన్యూ సదస్సులో 8.9 లక్షల దరఖాస్తుల పరిశీలనలో కీలకపాత్ర పోషిస్తున్నామని తెలిపారు. “61 ఏళ్లు నిండిన తండ్రుల స్థానంలో వారసులకు ఉద్యోగం ఇస్తే ప్రభుత్వానికి అదనపు భారం ఉండదు. చదువుకున్న యువత రెవెన్యూ వ్యవస్థలోకి వస్తే వ్యవస్థ బలోపేతం అవుతుందిఅని వివరించారు. ముఖ్యంగా విఆర్ఏల్లో 50-60% ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన దళిత, బలహీన వర్గాలకు చెందిన 3,797 కుటుంబాలను దయతలచి ఆదుకోవాలి అని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.ఇకనైనా తండ్రుల స్థానంలో వారి వారసులకు అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చి వీధిలు నిర్వహించేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో విఆర్ఏలు,టి.జనార్దన్, వెంకటయ్య, బలప్ప,నర్సిములు, హన్మంతు, వెంకటయ్య,విఆర్ఏ వారసులు తదితరులు పాల్గొన్నారు.

## నేలతల్లి ఆరోగ్యం...రైతులకు సౌభాగ్యం



### శాస్త్రవేత్త డాక్టర్ కె.పరిమళ.ఏవో సూర్య ప్రకాష్

**ధారూర్ మే 18(జనంసాక్షి)**ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధన సంస్థ తాండూర్ వారి ఆధ్వర్యంలో “రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్త లు”కార్యక్రమం , ధారూర్ మండలంలోని మోమిన్ కలాన్ గ్రామంలో సోమవారం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.పరిమళ ఈ సందర్భంగా మాట్లాడుతూ... నేలతల్లి ఆరోగ్యంగా ఉంటేనే రైతులకు సౌభాగ్యంగా పంటలు పండుతాయని రైతులు అధికంగా యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు.యూరియా అధిక వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతిని దీర్ఘకాలిక ఉత్పాదకత తగ్గుతుందని పేర్కొన్నారు .అలాగే రైతులు రసాయనాల వినియోగాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడాలని సూచించారు.అధిక రసాయనాల వాడకం వల్ల పర్యావరణం మరియు నేలతల్లి ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. పురుగుల మందుల ప్రభావం వల్ల రైతులకు మేలు చేసే వానపాములు మరియు మిత్ర పురుగులు కూడా నశిస్తున్నాయని తెలిపారు.అదనంగా మార్కెట్లో గిరాకి ఉన్న వరి రకాలు సాగు చేసి అధిక ఆదాయం పొందాలని రైతులకు సూచించారు.అనంతరం మండల వ్యవసాయ అధికారి సూర్య ప్రకాష్.మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం చేసి సహజ పద్ధతులను వినియోగించి రసాయన రహిత పంటలను పండించాలని పేర్కొన్నారు. అలాగే నీటి నిర్వహణలో భాగంగా స్ప్రింక్లర్ మరియు డ్రిప్ ఇరిగేషన్ వంటి బిందు సేద్య పద్ధతులను అవలంబించి నీటిని సంరక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ సల్మాన్. వ్యవసాయ విస్తరణ అధికారులు హరి ప్రసాద్. మల్లేష్.గ్రామ సర్పంచ్ మాధవి.ఉప సర్పంచ్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# సృష్టి లోని ప్రతి జీవి కనీస అవసరం నీరు

**కుక్కలకు ఉచిత నీళ్ళ తొట్లను పంపిణీ చేసిన**

**జాగృతి అభ్యుదయ సంఘం**

**అభినందనలు తెలిపిన మొద్దు లచ్చిరెడ్డి**

**హయత్ నగర్, మే 18 (జనం సాక్షి)**మల్కాజ్ గిరి మునిసిపల్ కార్పొరేషన్ వారు రూపొందించిన సిమెంట్ డాగ్ బౌల్స్ ను జాగృతి అభ్యుదయ సంఘం ఛైర్మన్ భావన శ్రీనివాస్ అధ్యక్షతన ఎల్.బి.నగర్ నియోజకవర్గం లోని వెంకటేశ్వర కాలని గణేష్ మండపం, హుడాసాయి నగర్ కమ్యూనిటీ హాల్, నాగోల్ కమ్యూనిటీ హాల్, సాహెబ్ నగర్ డివిజన్ నాగిరెడ్డి కాలనీ లలో ఉచితంగా పంపిణీ చేశారు. నాగిరెడ్డి కాలనీ పంపిణీ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి డివిజన్ మాజీ కార్పోరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ కుక్కలు సహజంగా విశ్వాస జంతువులని, సృష్టి లోని ప్రతి జీవి కనీస అవసరం ఐన నీరు, ఆహారం అందిస్తూ ప్రకృతి సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత మనుషులదే అని అన్నారు. ప్రకృతిలో భాగమైన కుక్కలకు దాహం వేసిన సందర్భాల్లో నీళ్ళు దొరకక అసహనంతో, ఆగ్రహానికి గురై మనుషులను కరవడం జరుగుతుందని, అవి కరవకుండా ఉండేందుకు నీళ్ళతొట్లు పంపిణీ హర్షణీయం అని కొనియాడారు. బౌల్స్ తీసుకున్న ప్రతి ఒక్కరూ వాటిని ఇంటి బయట ఉంచి, ప్రతి నిత్యం నీళ్ళు పోయాలని, అలా చేయడం వలన వీధి కుక్కలు సైతం మనుషులకు మచ్చిక అవుతాయని, అవి కరుస్తాయనే భయం ఉండదని తెలియజేశారు.కుక్కలను కాలభైరవుడిగా, గౌరీ దేవిగా కొలుస్తామని, దుర్గాదేవికి సింహం, అయ్యప్ప స్వామికి పులి, కుమార స్వామికి నెమలి, యముడికి దున్నపోతు, శివుడికి నందిగా ఎద్దు, వెంకటేశ్వర స్వామికి గరుత్మంతుడుగా గద్ద, సూర్యునికి గుర్రాలు ఇలా మనం భగవంతునిగా కొలిచే ప్రతి దేవుడికి ఆయా జంతువులు, పక్షులు వాహనాలుగా ప్రకటిస్తూ ప్రకృతిలోని జీవులతో మనిషి



అనుబంధాన్ని విడదీయలేమనే సంకేతాన్ని మన పూర్వీకులు చక్కగా మనకు అందించి ఉన్నారని తెలిపారు. దానినే ఇప్పుడు సైన్స్ పరిభాషలో "బయోడైవర్సిటీ" అని శాస్త్రవేత్తలు పరిశోధనలు ద్వారా నిర్ధారణ చేసి కాపాడుకోవాలంటూ కోరారు. ప్రభుత్వ చట్టాలు చేసి ఉన్నాయని, కుక్కలు కరవడాన్ని ప్రకృతి ఆగ్రహంగా గుర్తించి కాపాడుకునే చర్యలు చేపట్టాలని జాగృతి అభ్యుదయ సంఘం ఛైర్మన్ భావన శ్రీనివాస్ అన్నారు.ఈ పంపిణీ కార్యక్రమంలో గోపాల్ దాస్ రాము, శ్రీ వెంకటేశ్వర కాలని అధ్యక్షులు రాంబాబు గౌడ్, ద్వారకామయి నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సునీల్, సతీష్, నాగోల్ వివేకానంద ట్రస్ట్ శ్రీనివాసులు, నాగిరెడ్డి కాలని ప్రతినిధులు పూల్ సింగ్, గూడూరు వెంకటేష్ గౌడ్, కె.సోమయాజులు, పద్మావతి, వెంకటేష్, రఘునాథ్ యాదవ్, సాహెబ్ నగర్ డివిజన్ కాలనీల ప్రతినిధులు నందిరాజు లక్ష్మీనారాయణ, మనోజ్ గౌరిశెట్టి, భవాని సరస్వతి, నాగేంద్ర, ప్రశాంత్ గౌడ్, శశికాంత్, డాక్టర్ రాము, ఆంజనేయులు, నందకిషోర్, సూర్యానాయక్, కిరణ్, దయాకర్, చంద్రకాంత్, దయాకర్ ముదిరాజ్, రాంబాబు నాయక్, జాగృతి ప్రతినిధులు శ్రీరంగనాథ్, యాదా రామలింగేశ్వరావు, శృంగవరపు శ్రీనివాస్, శరత్ నలమార, ఆనబత్తుల సత్యనారాయణ, బాలాజి, కె.వి.రమణయ్య, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు త్రాగు నీటి ఇబ్బందులు

**సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్**



**నిజాంపేట్ మే 18 (జనం సాక్షి)**నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప పోచమ్మ దేవాలయం వద్ద అధికారులు, కాంట్రాక్ట్ నిర్లక్ష్యం వల్ల ప్రజలు తాగే నీళ్ల పైపుకు రంధ్రం పడడం వల్ల మున్సిపల్, వాటర్ డిపార్ట్మెంట్ అధికారుల సమన్వయం లోపం వల్ల నీటి సరఫరా ఆగిపోయింది. ఈ సమన్వయం లోపని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలపడం జరిగింది. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, వాటర్ డిపార్ట్మెంట్ వల్ల సమన్వయ లోపం వల్ల సామాన్య ప్రజలకు నీళ్లు రావడం లేదని అన్నారు. ప్రజలకు నీళ్లు అధించవలసిన వాటర్ డిపార్ట్మెంట్ అధికారులు, రోడ్లు ఇతర సౌకర్యాలు సమకూర్చే మున్సిపల్ అధికారుల సమన్వయ లోపం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు అని గుర్తు చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒక రోజు నీళ్లు రాకపోతే నెల బిల్లులో ఒక రోజు బిల్ కట్ చేసి ఇస్తారా అని ప్రశ్నించారు. కనుక నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్ట్ లైసెన్సు వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పొన్నకంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా 10వ తరగతి టాపర్ భౌరంపేట్ విద్యార్థి లక్ష్మీనారాయణ ను అభినందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**నిజాంపేట్ మే 18 (జనం సాక్షి)**మేడ్చల్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ పాఠశాల విద్యార్థి లక్ష్మీనారాయణ దుండిగల్ మండల్ ద్వితీయ స్థానం వచ్చిన గాగిల్లపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని శైలజను సోమవారం బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద వారిని అభినందిస్తూ శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి జిల్లా టాపర్‌గా నిలవడం గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో మరింత కష్టపడి చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అలాగే విద్యార్థిని ఈ స్థాయికి తీసుకురావడంలో కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డిగారిని, భిక్షపతి గౌడని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందకరమని, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్లు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి , నాచారం మురళీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతా చారి



**మాతృమూర్తి మహిళా కమిషన్ సభ్యురాలు**

**శంకరమ్మ కు విశ్వకర్మ జేఏసీ ఆధ్వర్యంలో సన్మానం**

**విశ్వకర్మ జేఏసీ ఛైర్మన్ రాయబండి పాండురంగ చారి**

**హయత్ నగర్, మే 18 (జనం సాక్షి)**నూనుగు మీసాల వయస్సు లోనే తన ప్రాణాలను తెలంగాణ కోసం తృణ ప్రాయంగా అర్పించిన మలిదశ తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతాచారి మాతృమూర్తి కాసోజు శంకరమ్మకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహిళా కమిషన్ సభ్యురాలుగా నూతనంగా ఎన్నిక చేయడం, రాష్ట్ర ప్రభుత్వానికి విశ్వకర్మ జేఏసీ ఛైర్మన్ రాయబండి పాండురంగ చారి అభినందనలు తెలియజేశారు.సోమవారం హయత్ నగర్ లోని కాసోజు శంకరమ్మ నివాసంలో విశ్వకర్మ జేఏసీ ఛైర్మన్ రాయబండి పాండురంగ చారి, వైస్ ఛైర్మన్ మారోజు రామాచారి, విశ్వకర్మ జేఏసీ రాష్ట్ర సలహాదారులు, ప్రేరణ సంస్థ అధినేత అక్కనపల్లి లక్ష్మ ణా చారి, రాష్ట్ర కోశాధికారి మోత్కూరి మల్లాచారి, బీసీ ప్రభంజనం రాష్ట్ర కో కన్వీనర్స్ బొంగు వెంకటేష్ గౌడ్, తెలంగాణ వెంకన్న, విశ్వకర్మ మహిళా నాయకురాలు వడ్ల అరుణ, ఎన్ రాజ్యలక్ష్మి, జేఏసీ రంగారెడ్డి జిల్లా నాయకులు కొంపోజు శ్రీకాంతాచారి లు నూతనంగా ఎన్నికైన మహిళా కమిషన్ సభ్యురాలు కాసోజు శంకరమ్మ, వెంకటా చారి లకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శంకరమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు, నా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా తెలంగాణ ఉద్యమ వందనాలు తెలియజేస్తున్నాను అని అన్నారు.ఈ సందర్భంగా రాయబండి పాండురంగ చారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి ఒక్కటి అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల భూమిని వెంటనే కేటాయించి, తెలంగాణ అమరవీరులను గుర్తించాలని తెలియజేశారు. తెలంగాణ సిద్ధాంతకర్త, స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ ను అధికారికంగా తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని, యావత్తు తెలంగాణ జాతి ముక్త కంఠంతో కోరుకుంటుందని తెలిపారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఒకే కుల జనాభాగా ప్రకటించి, కార్పొరేషన్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని, ప్రపంచీకరణ విధానాల వల్ల పంచ వృత్తులైన (కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, స్వర్ణకారు)లైన నిర్వీర్యమై అర్ధాకలి తో అలమటిస్తూ ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం 500 కోట్లు నిధులు బడ్జెట్ లో కేటాయించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్లాస్టిక్ ఫైబర్ సిమెంటు అల్యూమినియం వచ్చి పంచ వృత్తులు దెబ్బతిన్నాయని, 50 సంవత్సరాల నిండిన ప్రతి విశ్వకర్మ బిడ్డకు సామాజిక పెన్షన్ కింద నెలకు 5 వేల రూపాయలు కేటాయించి, విశ్వకర్మలను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోరుబాట పట్టిన వివోఏలు

**బొంరాస్ పేట, మే 18 (జనం సాక్షి):** రాష్ట్ర వివోఏల సంఘం పిలుపు మేరకు మండల పరిధిలోని వివోఏలు ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోరుబాట పట్టారు.సోమవారం సమైక్య భవనం ముందు టెంట్ వేసుకొని రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 58 జీవోను సవరించాలని,వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో వివోఏలను భాగస్వాములు చేయడంతో పని భారం ఎక్కువ అవుతుందని వాపోయారు.వివోఏలకు ఆరోగ్య భీమా ప్రమాద భీమా కల్పించాలని గౌరవ వేతనం పనికి తగ్గట్లు ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో వివోఏలు చరిత, చంద్రకళ,సూర్యా బసప్ప, మంజుల,మల్లప్ప,తారా సింగ్,రవి తదితరులు పాల్గొన్నారు



## రోడెక్కిన కర్షకులు

### జాప్యంపై మిన్పూర్‌లో నిరసన



**పాపన్నపేట, మే 18 (జనంసాక్షి) :** వరి ధాన్యం తరలించేందుకు లారీలు ఏర్పాటు చేయడం లేదని రైతులు రోడెక్కి నిరసన తెలిపారు. సోమవారం మిన్పూర్ లో మెదక్ – బొడ్మట్ పల్లి ప్రధాన రహదారిపై ఎక్కడి వాహనాలు అక్కడే స్థంభించాయి. అధికారులు విఫలం అయ్యారని మండిపడ్డారు.వాతావరణం మార్పులతో అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యం తడిసిపోయే అవకాశం ఉందన్నారు. హమాలీలు,వాహనాల కొరతగా ఉండటంతో లోడింగ్ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని,ధాన్యం తరలించిన లారీలు మిల్లులలో ధాన్యం బస్తాలు దింపుకోవడం లేదని దీంతో ఒక్కో మిల్లు వద్ద పదుల సంఖ్యలో లారీలు ధాన్యం బస్తాలతో రెండు,మూడు రోజుల పాటు నిలిచిపోతుండడంతో లారీల కొరత ఏర్పడిందని,నిర్వాహకులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ రైతులు ససేమిరా అంటూ భీష్మించి కూర్చున్నారు. దీంతో పోలీసులు హుటాహుటిన మిన్పూర్ చేరుకొని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సిబ్బంది రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా రోడ్డుపై బైఠాయించడంతో స్థానిక తహశీల్దార్ సతీష్ కుమార్ కు ఎస్ఐ శ్రీనివాస్ చరవాణిలో ఈవిషయం తెలపడంతో లారీలు కేంద్రానికి సమకూర్చుతానని తహశీల్దార్ తెలపడంతో చివరకు కర్షకులు శాంతించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రంలో దోపిడీపై ఫిర్యాదు



**తూప్రాన్ మే 18( జనంసాక్షి):** ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విక్రమ్ సింగ్ ఆరోపించారు. మనోహరాబాద్ మండల పరిధిలోని పరికిబండ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం లో నిర్వాహకులు రైతుల నుండి హమాలీ, బత్తా పేరుతొ డబ్బులు వసూలు చేస్తూన్నారని అయన అన్నారు.తన వద్ద 2600 ఫోన్ పే చేశాను నేను 500 నగదు డబ్బులు ఇచ్చానని తెలిపార వసూలు పై తహసీల్దార్ ముందు వాపోయారు. ప్రభుత్వం రైతులకు మేలు కోసం ధాన్యం కొనుగోలు లో రైతుల నుండి ఎలాంటి రుసుము తీసుకోవద్దని ఉత్తర్వులు ఉన్నా అవేవి పట్టనట్టుగా డబ్బులు ఇస్తేనే ధాన్యం నింపుతారని నిర్వాహకులు బహిరంగంగానే వసూలు చేస్తున్నారని దోపిడీ పై మనోహరాబాద్ తహసీల్దార్ కు పిర్యాదు చేసినట్లు తెలిపారు. దోపిడీ ని అరికట్టి రైతులకు న్యాయం చేయాలని ఉన్నతధికారులను కోరారు. దోపిడీ చేసిన సెంటర్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## రామంతాపూర్ బీరప్ప కల్యాణ మహోత్సవం



**ఉప్పల్, మే 18 (జనం సాక్షి):** రామంతాపూర్‌లోని బీరప్ప దేవాలయంలో ఘనంగా బీరప్ప కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గారికి వేదమంత్రాలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులతో కలిసి కల్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గారు, ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఉప్పల్ శ్రీశ్రీ నగర్‌లో రూ.90 లక్షల రోడ్డు పనులకు శ్రీకారం



**ఉప్పల్, మే 18 (జనం సాక్షి):** ఉప్పల్ పరిధిలోని శ్రీ శ్రీ నగర్ కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రోడ్డు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కాలనీలో దెబ్బతిన్న రహదారుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ, తరచూ ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో స్థానికులు తమ సమస్యను ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి మరియు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్థానికుల విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన రజిత పరమేశ్వర్ రెడ్డి గారు కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ రూ.90 లక్షల నిధులను మంజూరు చేయించగా, ఇచ్చిన హామీ మేరకు సోమవారం ఉదయం రోడ్డు నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. దీంతో కాలనీ వాసుల్లో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం తమ బాధ్యత అని తెలిపారు. మున్సిపల్ అధికారులతో ప్రత్యేకంగా చర్చించి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించామని, రోడ్డు పనులు నాణ్యతతో పూర్తి అయ్యేలా ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. శివారు కాలనీలు అయినా, ప్రధాన రహదారులు అయినా అభివృద్ధిలో ఎలాంటి తేడా ఉండదని స్పష్టం చేశారు. “కాలనీ ప్రజలు తమ సమస్యలను నా దృష్టికి తీసుకురావాలి. ప్రతి సమస్యకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తాం. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం మా బాధ్యత” అని ఆమె పేర్కొన్నారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానిక కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ రజిత పరమేశ్వర్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి సమస్య పరిష్కారమవుతోందని, ఇప్పుడు కాలనీలో ప్రయాణం సురక్షితంగా మారుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. నాగరాజు, అరురు కిషోర్ కుమార్, ఎం. భరత్ రాజ్ గౌడ్, వై. సుధాకర్ రావు, అప్పన శ్రీనివాస్, ఎం. గిరిబాబు, డా. ప్రవీణ్, వైఎస్ఎన్ మూర్తి, మల్లికార్జున రావు, మల్లారెడ్డి, సత్యన్, పి. సత్యనారాయణ, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీమతి అరురు పల్లవి, శ్రీమతి అప్పన వెంకట కుమారి, శ్రీమతి హరి కుమారి, శ్రీమతి రాధ, శ్రీమతి స్వరూప, శ్రీమతి శోభ, శ్రీమతి అనంత పద్మ, శ్రీమతి జయమ్మ, శ్రీమతి వీరమణి గారితో పాటు కాలనీ సభ్యులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అరుదైన పెల్విక్ ట్యూమర్‌కు శస్త్రచికిత్స విజయవంతం

### సైనిక్‌పురి ప్యూర్ ఆర్థో హాస్పిటల్ వైద్యుల ఘనత



**మల్కాజిగిరి మే 18 (జనంసాక్షి) :** మల్కాజిగిరి సైనిక్‌పురిలోని ప్యూర్ ఆర్థో హాస్పిటల్స్ వైద్యులు అత్యంత సంక్లిష్టమైన, అరుదైన పెల్విక్ ట్యూమర్ కణితి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. గత 10 సంవత్సరాలుగా పెల్విక్ ప్రాంతంలో 20 సెం.మీ నుండి 30 సెం.మీ భారీ ఆస్టియోకాండ్రోమా కణితితో బాధపడుతున్న 32 ఏళ్ల యువకుడికి ఈ ఆపరేషన్ చేసి విజయవంతం చేశామని డాక్టర్ అభిలాష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోగి కనితి ఎముక క్యాన్సర్ కాండ్రోసార్కోమా గా మారే లక్షణాలు ఉండటం, పైగా కణితి క్లిష్టమైన ప్రదేశంలో ఉండటంతో ప్రమాద తీవ్రత దృష్ట్యా నగరంలోని పలువురు వైద్యులు శస్త్రచికిత్సకు నిరాకరించారు.ఇతర ఆసుపత్రులలో చెప్పిన ఖర్చు కూడా ఆ కుటుంబానికి ఆర్థికంగా భారం కాగా, రోగి కుటుంబ సభ్యులు ప్యూర్ ఆర్థో హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ వివిఎస్. అభిలాష్ కుమార్‌ను కలిసి రోగి వివరాలు పూర్తిగా వివరించారు.ట్యూమర్ బోర్డు క్షుణ్ణమైన సమీక్ష తర్వాత, డాక్టర్ వివిఎస్ అభిలాష్ కుమార్ నాయకత్వంలో డాక్టర్ ఉదయ్ శేఖర్ రెడ్డి, డాక్టర్ మనోజ్ పుదారి, డాక్టర్ సాయి కార్తికేయ బద్రి, డాక్టర్ సాయి కృష్ణ సిఎస్ ల బృందం వైడ్ లోకల్ ఎక్సిషన్ విధానం ద్వారా కణితిని పూర్తిగా తొలగించారు. అనస్థీషియా, క్రిటికల్ కేర్ డాక్టర్ లక్ష్మీ కుమార్ జస్తి నేతృత్వంలోని బృందం ఈ సర్జరీకి సహకారం అందించింది. డాక్టర్ గౌతమ్ రెడ్డి నేతృత్వంలో శస్త్రచికిత్స అనంతర రోగి త్వరగా కోలుకునే విధంగా ఐసీయూలో పర్యవేక్షించాలని తెలిపారు.ఎంతో సంక్లిష్టమైన ఈ మేజర్ సర్జరీని ప్యూర్ ఆర్థో హాస్పిటల్స్ యాజమాన్యం రోగి ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని, అత్యంత తక్కువ ఖర్చుతో అందుబాటు ధరలోనే అందించామని అన్నారు. రోగి వేగంగా కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో రోగి కుటుంబ సభ్యులు డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉప్పల్‌లో కాంగ్రెస్ సంస్థాగత బలోపేతంపై సమీక్షా



**ఉప్పల్, మే 18 (జనంసాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా నేడు కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్యాలు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందమల్ల పరమేశ్వర్ రెడ్డి హాజరై డివిజన్ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులతో సమావేశమయ్యారు. సమావేశంలో బూత్ లెవల్ ఏజెంట్ల (బి ఎల్ ఏ లు) నియామక ప్రక్రియను వేగవంతం చేయడం, డివిజన్ అధ్యక్షుల నియామకం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం, ప్రజా పాలన కార్యక్రమాలను గడప గడపకు తీసుకెళ్లే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బిఎల్ఏ నుంచి డివిజన్ అధ్యక్షుడి వరకు ప్రతి ఒక్కరూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే మందమల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలపరచి రానున్న ఎన్నికల్లో విజయాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్ సంతోష్‌ను సన్మానించిన విజయరెడ్డి



**ఖైరతాబాద్, మే 18 (జనం సాక్షి) :** జి.హెచ్.ఎం.సి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ గా నూతనంగా నియమితులైన బదావత్ సంతోష్ ఐ.ఏ.ఎస్ ను సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఖైరతాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పి.విజయ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలు వా పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఈఏపీసెట్ 2026 టాపర్ రుషికి గవర్నర్ సత్కారం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ & ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ ఈఏపీసెట్) 2026లో మొదటి ర్యాంకు సాధించిన రెసోనెన్స్ జూనియర్ కళాశాలల విద్యార్థిని రుషిని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల లోక్ భవన్‌లో సత్కరించారు. ఆమె అద్భుత ప్రదర్శనకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎంసెట్ 1986లో ప్రారంభమైంది. తెలుగు రాష్ట్రాలలో ఇంజినీరింగ్, మెడికల్ విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు అత్యంత ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షగా నిలిచింది. కాలక్రమేణా ఈ పరీక్ష ఈఏపీసెట్ గా మారింది. రాష్ట్ర విభజన అనంతరం ఇది తెలంగాణ ఈఏపీసెట్, ఆంధ్రప్రదేశ్ ఈఏపీసెట్ వేర్వేరుగా కొనసాగుతోంది. నాలుగు దశాబ్దాలుగా అత్యున్నత ర్యాంకులు ఎక్కువగా అబ్బాయిలదే అయ్యేవి. ఈ సుదీర్ఘ ధోరణిని చెరిపేస్తూ చరిత్ర సృష్టిస్తూ రెసోనెన్స్ జూనియర్ కళాశాలలు హైదరాబాద్ కు చెందిన విద్యార్థిని ఎం రుషి టీజీ ఈఏపీసెట్ 2026లో రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంక్ సాధించింది. ఆమె ఈ అద్భుత విజయంతో రాష్ట్రంలో అగ్రస్థానాన్ని సాధించడం మాత్రమే కాకుండా అత్యంత పోటీతో కూడిన ఈ పరీక్షలో 'అబ్బాయిల ఆధిపత్యం' అనే దాదాపు 40 ఏళ్ల భావనను కూడా చెరిపేసింది.



ఈ సందర్భంగా రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణ చంద్రరావు నర్రా మాట్లాడుతూ రుషి సాధించిన ఈ చారిత్రాత్మక విజయం రెసోనెన్స్ జూనియర్ కాలేజీల అధ్యాపకులు, సహ విద్యార్థులు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచిందన్నారు. ఇది కేవలం ఒక ర్యాంక్ మాత్రమే కాదని, ఇది మొత్తం తరానికి స్ఫూర్తిగా నిలిచే ఘన విజయమని పేర్కొన్నారు.

# ఉప్పల్‌లో తాగునీరు, మురుగునీటి సమస్యలపై చర్చ

### పలు కాలనీల్లో నీటి కొరత, కలుషిత నీటి సరఫరాపై వినతి
### పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు విజ్ఞప్తి

**ఉప్పల్, మే 18 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో రోజురోజుకూ తీవ్రమవుతున్న త్రాగునీటి కొరత, కలుషిత నీటి సరఫరా, మురుగునీటి పారుదల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు మందమల్ల పరమేశ్వర్ రెడ్డి హైదరాబాద్ మహానగర జలమండలి కార్యనిర్వాహక సంచాలకురాలు పంకజ ను కలిసి సమగ్ర



వినతిపత్రం సమర్పించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని పలు డివిజన్లు, కాలనీలు, బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యలను వివరంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మందమల్ల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, వేసవి కాలం ప్రారంభమైనప్పటి నుంచి అనేక ప్రాంతాల్లో త్రాగునీటి కొరత తీవ్రరూపం దాల్చిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రైవేటు నీటి ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. బీరప్పగడ్డ ప్రాంతంలోని వాకిటి బుచ్చిరెడ్డి ఇంటి సమీపంలో భూగర్భ మురుగునీటి కాలువ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోందని తెలిపారు. వర్షాలు పడితే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని, వెంటనే కొత్త భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా బీరప్పగడ్డ రామాలయం వీధిలో పాత త్రాగునీటి పైపులు దెబ్బతిన్న కారణంగా తరచూ లీకేజీలు జరుగుతున్నాయని, కలుషిత నీరు త్రాగునీటిలో కలిసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అక్కడ వెంటనే కొత్త పైపుల మార్గాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. చిలకనగర్ కుమారికుంట ప్రాంతంలో గత రెండు వారాలుగా త్రాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. నీటి కోసం ప్రజలు రాత్రిళ్లు కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ ప్రాంతంలో కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. కొన్ని కుటుంబాల్లో జ్వరాలు, కడుపు సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారని చెప్పారు. సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా పరిష్కరించేలా కొత్త త్రాగునీటి పైపుల మార్గాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఉప్పల్ పాత గ్రామం, కురుమనగర్, ఉప్పల్ హిల్స్, విజయపురి కాలనీలలో గత రెండు వారాలుగా త్రాగునీటి సరఫరాలో ఒత్తిడి తీవ్రంగా తగ్గిపోయిందని పేర్కొన్నారు. ఎత్తైన ప్రాంతాలకు నీరు సరిగా చేరక ప్రజలు బిందెలతో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నీటి పంపింగ్ వ్యవస్థను బలోపేతం చేసి సరిపడా ఒత్తిడితో నీటి సరఫరా చేయాలని అధికారులను కోరారు. వెంకట్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని రామ్‌రెడ్డి నగర్ ప్రాంతంలో కూడా కలుషిత నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. పైపులు పాడైపోవడంతో మురుగునీరు కలుస్తోందని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే కొత్త పైపుల మార్గాలను ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. రామంతాపూర్ బాగాయత్ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. పనులు ఆలస్యం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మందమండ పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడంతో పాటు మురుగునీటి సమస్యలను పూర్తిగా పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధికారులు ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకొని యుద్ధప్రాతిపదికన స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అకిటి ఆగంరెడ్డి, రాజేష్ ముదిరాజ్, శ్రీకాంత్ యాదవ్, అరుణ్ పటేల్, సల్ల ప్రభాకర్ రెడ్డి, సుంకు శేఖర్ రెడ్డి, మంద మురళీకృష్ణారెడ్డి, మహేందర్ ముదిరాజ్, జగదీష్, అశోక్, బాలచందర్, అనూప్ తదితరులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# 'మీ సురక్ష'కు విశేష స్పందన : సిఐ సందీప్ కుమార్

**మల్కాజిగిరి మే 18 (జనంసాక్షి) :** ప్రజల భద్రతే ధ్యేయంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఆధ్వర్యంలో ఇటీవల ప్రారంభించిన 'మీ సురక్ష' కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని నేరేడ్‌మెట్ సిఐ సందీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవలి కాలంలో జరుగుతున్న వివిధ సంఘటనల నేపథ్యంలో ఇళ్లలో పనిచేసే వారు, డ్రైవర్లు, కేర్‌టేకర్లు, వాచ్‌మెన్లు, సెక్యూరిటీ గార్డులు, వంటవాళ్లు, అలాగే కిరాయిదారుల పూర్తి వివరాలను 'మీ సురక్ష' గూగుల్ ఫామ్ లేదా క్యూఆర్ కోడ్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇప్పటికే కాలనీలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులకు క్యూఆర్ కోడ్‌లు, లింక్‌లు అందజేశామని, ఇంకా నమోదు చేసుకోని వారు వెంటనే ఎన్రోల్ చేసుకోవాలని కోరారు. దీనిపై అవగాహన కల్పించేందుకు కాలనీల్లో ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నామని, అలాగే నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక రిసెప్షన్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



# హృతిక్ రోషన్‌తో 'పానీ హో తో క్లియర్'

### ప్రచారం ప్రారంభించిన క్లియర్ వాటర్

**ఖైరతాబాద్, మే 18 (జనం సాక్షి) :** క్లియర్ ప్రీమి యం వాటర్ తన ప్రతిష్టాత్మక 'పానీ హోతో క్లియర్' ప్రచారాన్ని ప్రారంభించినట్లు క్లియర్ ప్రీమియం వా టర్ వ్యవస్థాపకుడు, సీఈఓ నయన్ షా సోమవా రం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ భారతీయ వినియోగదారులను అసలైన దానిని ఎంచుకునే లా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ప్రచారంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. బ్రాండ్ అంబా సిడర్ హృతిక్ రోషన్ నటించిన ఈ కొత్త టీవీసీ హాస్యం, సాంస్కృతిక జ్ఞాపకాలు, స్పష్టమైన సందే శంతో భారత దేశంలోని నకిలీ నీటి మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. క్లియర్ వాటర్ గత మూడేళ్లుగా మార్కెట్ లో నాణ్యతతో కూడిన నిబద్ధతను ప్రదర్శిస్తుందని తెలిపారు. వినియోగ దారులకు సురక్షితమైన తాగునీటిని అందిస్తూ, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.

# జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

### ఎంపీ లేఖను కలెక్టర్‌కు అందజేసిన వడ్ల నందు



**వికారాబాద్ మే 18, (జనంసాక్షి):** వికారాబాద్ జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అందించిన లేఖను వికారాబాద్ జిల్లా జిల్లా కలెక్టర్ కు అందజేసిన వికారాబాద్ జిల్లా దిశా కమిటీ మెంబెర్ బిజెపి అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు. లేఖలో వికారాబాద్ జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ ఆలస్యంతో రైతులు తమ పంటను సరైన ధరలకు విక్రయించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు మరియు నష్టపోయే పరిస్థితుల్లో అమ్మకాలకు దిగవలసి వస్తోందని. అదిలాబాద్ వంటి జిల్లాలలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కొనుగోలు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని. అక్కడి రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను మార్కెట్ చేయగలుగుతున్నారని. వికారాబాద్ జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వినమ్రంగా కోరుతున్నాను. సమయానుకూల జోక్యం రైతులకు ఎంతో మేలు చేసి వారి ప్రయోజనాలను కాపాడుతుందని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో రొంపల్లి సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ లు స్రవంతి శాంరెడ్డి, రుచిత సాయిచరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు వర్క్ బుక్స్

**అంబర్పేట్ మే 18( జనం సాక్షి)**

కేవలం పాఠాలు వినడమే కాకుండా, నిరంతర సాధన ద్వారానే విద్యార్థులు సబ్జెక్టులపై పట్టు సాధిస్తారని, తద్వారా పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విద్యాశాఖ భావిస్తుంది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన వర్క్ బుక్స్ ను ఈ విద్యా సంవత్సరం నుండి ఆరవ తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ అందించాలని సంకల్పించింది. తెలుగు,ఇంగ్లీష్, హిందీ, సైన్స్, సోషల్, మ్యాథ్స్ సబ్జెక్టుల వర్క్బ బుక్స్ సులభంగా అర్థమయ్యేలా కన్వర్జేషన్ విధానంలో మాడ్యూల్ తయారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు పది లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర నున్నది. ఆధునిక విద్యా విధానానికి అనుగుణంగా, పోటీ ప్రపంచంలో ప్రభుత్వ విద్యార్థులు రాణించేలా ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం. దాదాపు 90 శాతం పుస్తకాలను ఇంగ్లీష్ మీడియంలోనే ముద్రిస్తారు . దీనివల్ల విద్యార్థులకు ఆంగ్ల భాష పై పట్టు పెరగడమే కాకుండా, సిలబస్ లో పొందుపరిచిన అంశాలను విద్యార్థులు పాఠం చెప్పడం పూర్తయిన వెంటనే ప్రాక్టీస్ చేసుకునేందుకు వీలుంటుందని, తద్వారా ఆయా అంశాలపై పట్టు పెరిగి విద్యా పరిజ్ఞానం పెరుగుతుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.